




విద్యుత్ వెలుగుల్లో నగరం

విద్యుత్ వెలుగుల్లో నగరం కనువిందు చేస్తోంది. ఒక వైపు కనకదుర్గ ఫ్లై ఓవర్‌కు విద్యుత్ దీపాలంకరణ, మరో వైపు వాటర్ ఫౌంటెయిన్లు, పార్కులతో నగరం నూతన శోభను సంతరించుకుంది. రాత్రి వేళ సందర్శకులను ఆకట్టుకుంటోంది. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో దేవినేని అవినాష్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దంపతులు మంగళవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారిని ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ పాల్గొన్నారు.

మహంతిపురం పరిధిలో ఫుట్ పెట్రోలింగ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీసులు మంగళవారం మహంతిపురం, గొల్లపాలెంగట్టు రోడ్డు, కొండ ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. కొండపై ఖాళీ స్థలాలతో పాటు జన సంచారం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా చేరుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ పర్యవేక్షణలో కొత్తపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది, క్యూఆర్‌టీ టీమ్ పెట్రోలింగ్‌లో పాల్గొన్నారు.

కిలోన్నర గంజాయి స్వాధీనం.. యువకుడి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయి విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నైనవరం ఫ్లై ఓవర్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందిందన్నారు. దీంతో సీఐ సుబ్రహ్మణ్యం ఫ్లై ఓవర్ వద్ద గస్తీ ఏర్పాటు చేయగా కొత్తపేట పితాని అప్పలస్వామి వీధికి చెందిన పిల్లి సాయికుమార్(21) అనుమానాస్పదంగా కనిపించాడు. సాయికుమార్‌ను తనిఖీ చేయగా అతని వద్ద కిలోన్నర గంజాయిని గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వీరాంజనేయ స్వామి సన్నిధిలో అన్నదానం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షాపీఠంలోని శ్రీ రామభక్త అభయ వీరాంజనేయ స్వామి వారికి మంగళవారం విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు చేపట్టారు. అనంతరం తమలపాకులతో అర్చన, పంచహారతుల సేవ నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పాదచారులు, వాహన చోదకులు, స్థానికులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊర్మిళానగర్‌కు చెందిన పానుగంటి రామకృష్ణ, మధులలిత భార్యభర్తలు. రామకృష్ణ బందరు రోడ్డులోని బట్టల షాపులో పనిచేస్తుండగా, భార్య మధులలిత ప్లైవుడ్ షాపులో పనిచేస్తోంది. 17వ తేదీ ఉదయం మధులలిత ఫోన్‌లో మాట్లాడుతుండగా.. ఎవరితో మాట్లాడుతున్నావని రామకృష్ణ ఆమెను అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అదే రోజు సాయంత్రం 6 గంటల సమయంలో రామకృష్ణ డ్యూటీకి వెళ్లాడు. మధులలిత తాను బయటకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి పొద్దుపోయినా తిరిగి రాలేదు. చుట్టుపక్కల వారు, బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో తన భార్య మధులలిత కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఉదయభాను, వెంకటనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అడపా శేషు, వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ అకాడమీ, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు, గొల్ల రాధాకృష్ణ సాహితీపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సినీ నటుడు ఎస్.వి.రంగారావు వర్ధంతి సందర్భంగా విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు స్మారక రంగస్థల పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కళాకారులందరి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఎస్వీఆర్ వంటి నటులు అరుదుగా జన్మిస్తారని, ఆయన నటనను నేటి తరం నటులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ.. ఎస్వీఆర్ నటజీవితానికి పునాది రంగస్థలమేనని పేర్కొన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా ఈ సభకు అధ్యక్షత వహించారు. కార్పొరేటర్ బాల గోవిందు, కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు పి.వి.ఎల్.నృసింహం, వివిధ రంగాలకు చెందిన కంది గంగాధరరావు, గొల్లపూడి గంగాధర్, నందివాడ నాని, రావి వెంకట్ పాల్గొన్నారు. రంగస్థల ప్రముఖులు మద్దాల ఉదయభానుకు 2022 సంవత్సరానికి, కొర్రపాటి వెంకటనారాయణకు 2023 సంవత్సరానికి విశ్వనటచక్రవర్తి ఎస్వీ రంగరావు స్మారక రంగస్థల పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పాండవ రాజసూయం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

కాల్వల్లో చెత్త వేస్తే జరిమానా విధింపు



కాల్వను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రధాన కాల్వల్లో చెత్త వేసే వారికి జరిమానా విధించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం బందరు, ఏలూరు, రైవస్, కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్లపై శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించాలంటే ప్రధానంగా పరిసరాలు, కాల్వలు, రహదారులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలను తెచ్చి రోడ్లపై వేస్తున్న వారిని గుర్తించాలన్నారు. అవసరమైతే సీసీ కెమెరాలను పరిశీలించి చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని చెప్పారు. వ్యర్థాలు తరలించే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ వర్కర్లందరూ కాల్వలు, వీధులు నిరంతరం శుభ్రం చేయాలన్నారు. కమిషనర్ పర్యటనలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఠా కార్మికులకు ఒప్పందాల ప్రకారం వ్యాపారులు అందించే కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని, వ్యాపార అసోసియేషన్లు కార్మిక సంఘాలను చర్చలకు పిలవాలని కోరుతూ ముఠా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీలో ముఠా కార్మికులు ప్రదర్శనను నిర్వహించారు. స్థానిక సామారంగంచౌక్ సెంటర్ నుంచి బయలుదేరిన ప్రదర్శన వివిధ ముఖ్య వ్యాపార కూడళ్ల మీదుగా చిట్టూరి కాంప్లెక్స్ సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ముఠా కార్మికులకు గత కూలి పెంపుదల ఒప్పంద కాలం గడిచి రెండు నెలలు దాటిందన్నారు. యజమానులు స్పందించకపోవడంతో చర్చలకు పిలవాలని కోరుతూ ఈ ప్రదర్శన చేస్తున్నామన్నారు. పెరిగిన నిత్యవసరాల సరుకుల ధరలకు అనుగుణంగా కూలీరేట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి సాంబశివరావు, ముఠా కార్మిక సంఘాల నాయకులు ఎం.సీతారాములు, వీ నాగేశ్వరరావు, ఎం.బ్రహ్మయ్య, సీహెచ్ శ్రీరామమూర్తి, కోరే కొండలు పాల్గొని ప్రసంగించారు. నాయకులు చౌదరి, దాసు, నరసింహులు, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ లలితానగర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జోజినగర్, లలితానగర్, పోలీస్‌కాలనీ, టెలిఫోన్ కాలనీ, నేతాజీ హైస్కూల్ రోడ్, నూరి మసీదు రోడ్, రైతుబజార్ రోడ్, మానవ మందిరం వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

పర్యావరణ మార్పులపై అవగాహన



భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో చైల్డ్ ఫండ్ సంస్థ ఆధ్వర్యంలో జెండర్, వాతావరణ మార్పులకు కారణాలు, నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడీపీఓ నాగమణి, ఏసీడీపీఓ జ్యోత్స్న, ఎంపీటీసీ కల్పన కిషోర్, విజయవాడ రూరల్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ.. చిన్నారులపై లింగ వివక్షత చూపరాదన్నారు. అందరినీ సమానంగా చూడాలని తల్లిదండ్రులకు చెప్పారు. ప్రోగ్రామ్ సీనియర్ ఆఫీసర్ ఏ.రాజ్‌కుమార్, పి.రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణానికి హాని కలిగించరాదన్నారు. ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. కమ్యూనిటీ మొబెలైజర్స్ నవీన్, రజని, లావణ్య, పుణ్యవతి, దివ్య పాల్గొని పర్యావరణంలో మార్పులకు గల కారణాలను వివరించారు.

ఎస్వీ రంగారావు నటన చిరస్మరణీయం

ఘనంగా ఎస్వీఆర్‌కు నివాళి



కాపు సంఘం కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వవిఖ్యాత నటుడు దివంగత సామర్లకోట వెంకట రంగారావు(ఎస్వీఆర్) అద్వితీయ నటన చిరస్మరణీయమని ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి ఐక్య సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు అన్నారు. ఎస్వీఆర్ వర్ధంతి సందర్భంగా విద్యాధరపురం వంగవీటి మోహన రంగా జంక్షన్‌లోగల సంఘ కార్యాలయంలో ఎస్వీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎస్వీ రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

భారతరత్నతో గౌరవించాలి..

దుర్గారావు మాట్లాడుతూ.. ఎస్వీ రంగారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలన్నారు. తన నటన ద్వారా ఆబాలగోపాలాన్ని ఎంతగానో అలరించిన ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలని యావత్ తెలుగు ప్రజలతో పాటు ఆయన అభిమానులు, కళాకారులు ముక్తకంఠంతో నినదిస్తున్నారని తెలిపారు. ఎస్వీఆర్ సేవలను సంఘం అధ్యక్షుడు పదిలం రాజశేఖర్ కొనియాడారు. కాపు సంఘం నాయకులు చందూరు సత్యనారాయణ, జవ్వాది వెంకట్రావు, సుంకర నారాయణ, నల్లం వాసు, ఇనపకుర్తి రాము, ఉండభట్ల వెంకట్రావు, మంగ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

తిరుపతి వెంకటయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

విద్యాధరపురం కబేళా రోడ్‌లోని తిరుపతి వెంకటయ్య చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఎస్వీ రంగారావు వర్ధంతిని నిర్వహించారు. ట్రస్ట్ సభ్యురాలు తిరుపతి అనూష మాట్లాడుతూ ఎస్వీఆర్ చనిపోయి నేటికి 49 ఏళ్లయినా ఆయన నటన అజరామరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి సురేష్, పసుపులేటి కృష్ణ, సూదాబత్తుల సూరిబాబు, మహేశ్వరి, ఉమామహేశ్వరరావు, త్రినాథ్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మరుపిళ్ల చిట్టి సేవలు అపూర్వం



చిట్టి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ ఎమ్మెల్యే సర్దార్ మరుపిళ్ల చిట్టి నగరానికి అందించిన సేవలు అపూర్వమని పలువురు కార్పొరేటర్లు కొనియాడారు. మరుపిళ్ల చిట్టి 52వ వర్ధంతిని రమణయ్య కూల్‌డ్రింక్‌షాప్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహం వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, మహాదేవు అప్పాజీరావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు, మరుపిళ్ల రాజేష్, ఇతర నాయకులు చిట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. మరుపిళ్ల చిట్టి ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధునిగా, శాసనసభ్యునిగా, కాంగ్రెస్ నేతగా విజయవాడ నగరాభ్యున్నతికి విశేషంగా పాటుపడ్డారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి తరం ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం పాలకవర్గ సభ్యుడు గురుమహంతు మహేష్, దుర్గా కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొరగంజి భాను, నగరాల యువజన సంఘం నాయకులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహోన్నత నటశిఖరం ఎస్వీఆర్



ఎస్వీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన హజరత్తయ్య గుప్తా తదితరులు

విజయవాడకల్చరల్: మహోన్నత నట శిఖరం ఎస్వీ రంగారావు అని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. భగవాన్ శరణం కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం సినీనటుడు, నిర్మాత, దర్శకుడు ఎస్వీ రంగారావు 49వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ నడిచే నట శిఖరం ఎస్వీ రంగారావు అని అభివర్ణించారు.

ఆయన పోషించినన్ని విభిన్న పాత్రలు మరే నటుడూ పోషించలేదన్నారు. భగవాన్ శరణం కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ మాట్లాడుతూ 1918వ సంవత్సరంలో నూజివీడులో జన్మించారని, 1946వ సంవత్సరం వరూధిని చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేశాడని చనిపోయేంత వరకూ నటిస్తూనే ఉన్నారని తెలిపారు. ఎస్వీఆర్ విగ్రహానికి ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రంగస్థల ప్రముఖులు ఆచంట బాలాజీ నాయుడు, కొర్రపాటి వెంకట నారాయణ శర్మ, మద్దాల ఉదయ భాను, పీవీఎల్ నృసింహం, పిలకా విశ్వనాథం, సూర్యనారాయణ మూర్తి, సాంబశివరావు పాల్గొన్నారు.

• ఇంటిముందుకే వైద్యం



విజయవాడ శివారులోని నైనవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ)లో వైద్యం అందించేందుకు 104 వాహనంలో వైద్యసిబ్బంది వెళ్లి గ్రామస్తులకు వైద్య సేవలందించారు. ఆ గ్రామానికి చెందిన ఓ మహిళకు డాక్టర్ శ్వేత వైద్య పరీక్షలు నిర్వహించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇంద్రకీలాద్రి నివేదనశాలలోకి సాధారణ భక్తుడు

వివరణకు ఈవో ఆదేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారి నివేదనలు సిద్ధం చేసే వంటశాలలోకి సామాన్య భక్తుడు ప్రవేశించిన ఘటన విమర్శలకు దారి తీసింది. దుర్గగుడి వైదిక కమిటీ సభ్యుడితో కలిసి ఆ భక్తుడు మంగళవారం అమ్మవారి నివేదన శాలలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. సాధారణంగా నివేదన శాలలోకి ఆలయ అర్చకులకు మినహా మిగిలిన వారికి అనుమతి లేదు. ఆలయ వ్యవహారాలు పరిశీలించే వైదిక కమిటీ సభ్యుడే ఆ భక్తుడిని వంటశాలలోకి తీసుకెళ్లిన ఈ వ్యవహారం ఈవో భ్రమరాంబ వరకు చేరింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆమె ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో వంటగది ఎదుట ఉన్న సీసీ కెమెరా పుటేజీని సైతం పరిశీలించినట్లు తెలిసింది.

‘మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు ఆపాలి’



క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ జరిగిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ‘దహించు అగ్ని’ మినిస్ట్రీస్ అధ్యక్షుడు డాక్టర్ వి.థామస్ కోరారు. జింఖానా మైదానం సమీపంలోని కందుకూరి కల్యాణ మండపంలో క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. తొలుత క్రైస్తవులపై దాడులకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులు ప్రపంచాన్ని కలచివేశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఈ దాడులను అరికట్టి, శాంతి నెలకొల్పాలని విజ్ఞప్తిచేశారు. ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం, ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ రెవరెండ్ దయానంద్, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంపూర్ణ గృహ హక్కును అందరికీ వర్తింప చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీ హెచ్ బ్లాక్‌లో నివసిస్తున్న లబ్ధిదారులు అందరికీ జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద లబ్ధి చేకూర్చాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో హెచ్ బ్లాక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.ఎస్.నాయుడు, కార్యవర్గ సభ్యుడు మీసాల సత్యనారాయణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. 262 సచివాలయ పరిధిలో 1,056 కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్కొక్క కుటుంబం ప్రభుత్వానికి రూ.69 వేల చొప్పున చెల్లించాల్సి ఉండగా రూ.20 వేలు మాత్రమే తీసుకుని 539 కుటుంబాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారని వివరించారు. మిగిలిన కుటుంబాలకు అలాంటి సదుపాయం కల్పించాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశాకు అందజేశారు.

మత్తు పదార్థాలపై అవగాహన అవసరం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏడీసీపీ విశాల్‌గున్ని, నార్త్ డివిజన్ ఏసీపీ రవికాంత్ ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు మెడికల్, ఫ్యాన్సీ షాపుల నిర్వాహకులతో మత్తు పదార్థాల విక్రయంపై మంగళవారం అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే వైట్‌నర్, సొల్యూషన్ పీల్చడం, మెడికల్ షాపుల్లో లభించే బోన్‌ఫిక్స్, పలు రకాల మత్తు మాత్రలు వాడటం ఎక్కువగా జరుగుతోందన్నారు. వాటిని అరికట్టేందుకు మెడికల్ షాపు నిర్వాహకులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే యువతకు ఎటువంటి మందులూ విక్రయించొద్దని స్పష్టంచేశారు. ఎవరైనా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ దుర్గామహేష్, ఉమెన్ ఎస్ఐ దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

పాయకాపురం(విజయవాడరూరల్): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని 62వ డివిజన కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. 270 సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వలంటీర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. నాయకులు రామిరెడ్డి, హైమావతి, సావిత్రి, సుభాని, రాధ, వెంకట్, బ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

బాధిత విద్యార్థినికి చేయూత

మధురానగర్(విజయవాడసెంట్రల్): రైలు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్న అంబేడ్కర్ కాలనీకి చెందిన విద్యార్థిని అఖిలకు మన మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం ఆర్థిక సాయం, సరుకులు అందజేశారు. జైపూర్ కృత్రిమ కాళ్లు అందించేందుకు కృషి చేస్తామని వారు ఆమెకు హామీ ఇచ్చారు.